
సాక్షి
బాపట్ల
సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



నీలకంఠేశ్వరస్వామి కల్యాణం

అచ్చంపేట: భీష్మ ఏకాదశి సందర్భంగా సర్వ మంగళా సమేత నీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రాత్రి కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ నీటి మట్టం ఆదివారం 544.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,040 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వైభవంగా స్వామి వారి కల్యాణం

నగరంపాలెం: గుంటూరు బ్రాడీపేటలోని గౌరీ విశ్వేశ్వరాలయంలో ఆదివారం స్వామి వారి జన్మ నక్షత్రం పురస్కరించుకుని కల్యాణం వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

మద్యం దుకాణాల కేటాయింపు లాటరీ వాయిదా

నెహ్రూనగర్: ప్రభుత్వం గీత కులాలకు గుంటూరు జిల్లాలో కేటాయించిన 13 మద్యం షాపులకు లైసెన్స్‌ల జారీకి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ 8వ తేదీతో ముగిసింది. ఎన్నికల కోడ్ కారణంగా సోమవారం జరగాల్సిన లాటరీ ప్రక్రియ నిరవధికంగా వాయిదా పడింది. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఈ ప్రక్రియను వాయిదా వేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషన్ డాక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 233 మంది దరఖాస్తు చేసుకున్నారు. తద్వారా డిపాజిట్ల రూపంలో ప్రభుత్వానికి రూ.4.66 కోట్లు ఆదాయం సమకూరింది.

నేడు నామినేషన్ దాఖలుకు తుది గడువు

లక్ష్మీపురం: ఈ నెల 27వ తేదీన జరగనున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ దాఖలుకు తుది గడువు సోమవారం మధ్యాహ్నం 3 గంటలతో ముగినుంది. ఈ మేరకు సహాయ రిటర్నింగ్ అధికారి డీఆర్‌ఎం షేక్ ఖాజావలి ఆదివారం తెలిపారు. జిల్లా పరిధిలో ఈ ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్‌ను 0863–2241029 నెంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు.

పల్నాడు డీఆర్‌డీఏ పీడీ ప్రభుత్వానికి సరెండర్




నరసరావుపేట: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్‌డీఏ) పీడీ బాలూనాయక్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అమరావతి, అచ్చంపేట మండలాల్లో మంజూరు చేసిన వెలుగు రుణాల్లో భారీఎత్తున అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అమరావతి మండలంలో కోటి రూపాయలకు పైగా వెలుగు రుణాలు పక్కదారి పట్టడమే గాకుండా, అవినీతికి పాల్పడిన ఉద్యోగులకు అండగా ఉండటం, కింది స్థాయి సిబ్బందిని వేధింపులకు గురి చేయడం తదితర ఆరోపణలపై చర్యలు తీసుకున్నారు. బాలూనాయక్ మూడేళ్లుగా కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన నుంచి వివరణ తీసుకునేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఒక్క మాత్రతో నులిపురుగుల నివారణ



గుంటూరు మెడికల్: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా సోమవారం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. ఒకే ఒక్క మాత్రతో పిల్లల కడుపులో ఉండే నులిపురుగులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడాది నుండి 19 సంవత్సరాల పిల్లలందరికి తప్పనిసరిగా నులిపురుగుల నిర్మూలన కోసం 400 ఎంజీ ఆల్బెండజోల్ బిళ్ళలను వారితో చప్పరింపజేసి, మింగించాలని తెలిపారు. ఏడాది నుండి రెండేళ్ల పిల్లలకు అరమాత్ర, 2 నుండి 19 సంవత్సరాల పిల్లలకు పూర్తి మాత్ర ఇవ్వాలని వెల్లడించారు. సోమవారం ఇవ్వని వారికి ఈ నెల 17న జరిగే మాపప్ రౌండ్‌లో ఇవ్వాలన్నారు. మధ్యాహ్నం భోజనం అయిన తర్వాత గంట తేడాతో మాత్రలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. జిల్లాలో అర్హులైన పిల్లలు 4,24,742 మంది ఉన్నారని, జిల్లాకు 4,50,000 ఆల్బెండజోల్ మాత్రలు సరఫరా చేసినట్లు వెల్లడించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో మాత్రమ పంపిణీ ఉంటుందని తెలిపారు. నులిపురుగుల నిర్మూలన వల్ల పిల్లలలో రక్తహీనత పోతుందన్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 156, తూర్పు కెనాల్‌కు 142, పశ్చిమ కెనాల్‌కు 125, నిజాంపట్నం కాలువకు 80, కొమ్మమూరు కాలువకు 870 క్యూసెక్కులు విడుదల చేశారు.

కప్పం కడితేనే కుప్ప కదిలేది



ధాన్యం నిల్వలు చేలల్లోనే నిలిపేసిన పచ్చనేత

- కొమ్మమూరు కాలువకింద గత ఖరీఫ్‌లో ఇంజిన్లు పెట్టి నీళ్లు ఇచ్చామంటున్న పచ్చనేత
- అందుకు ప్రతిగా ఇప్పుడు ఎకరానికి రూ.4 వేలు చెల్లించాలంటూ హుకుం
- డబ్బులు చెల్లించేవరకూ ధాన్యాన్ని తీసుకు వెళ్లనివ్వమని అడ్డుపడుతున్న వైనం
- చెప్పినా పట్టించుకోని తహసీల్దార్
- చినగంజాం మండలం సంతరావూరు, వేటపాలెం రైతులపై దౌర్జన్యం
- వారంరోజులుగా చేలల్లోనే ధాన్యం
- తాము ఇంజిన్ల నీళ్లు వాడుకోలేదంటున్న రైతులు
- పచ్చనేత దాదాగిరిపై సర్వత్రా ఆగ్రహం



చినగంజాం మండలం సంతరావూరు పొలాల్లో వేటపాలెం రైతుల వరికుప్పలు అలాగే ఉన్న దృశ్యం

సాక్షి ప్రతినిధి,బాపట్ల: చిన్నగంజాం మండలం పరిధిలోని సంతరావూరు గ్రామం కొమ్ముమూరి కెనాల్ పరిధిలో సంతరావూరు – వేటపాలెం రోడ్డు పక్కన చవిటివాత మాగాణీ పొలాల్లో ఖరీఫ్ సాగు కింద దాదాపు 120 ఏకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. పంటకోత దశకు రావడంతో కోత మిషన్ల ద్వారా వరి కోతలు కోసి ధాన్యం ఇంటికి తరలించుకోవడానికి సిద్ధం చేసుకున్నారు. అయితే సంతరావూరికి చెందిన పచ్చ పార్టీ నేత కోటయ్య రైతులు పండించిన ధాన్యం బస్తాలు ఊర్లోకి వెళ్లకుండా అడ్డకుంటున్నారు. ధాన్యం బయటకు వెళ్లాలంటే ఎకరానికి రూ.4 వేలు కప్పం కట్టాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ధాన్యాన్ని పొలంలోనుంచి బయటకు వెళ్లనిచ్చేది లేదంటూ తన అనుచరులను కాపలా పెట్టారు. దీంతో చాలామంది రైతులు ఆయనకు భయపడి ఎకరానికి రూ.4 వేలు కప్పం చెల్లించగా మరికొందరు నిరాకరించారు. వేటపాలెంకు చెందిన 15 మంది రైతులకు చెందిన 35 ఏకరాల్లో ధాన్యం ఇప్పటికీ పొలాల్లోనే ఉండి పోయింది.

గత ఏడాది జరిగింది ఇదీ..

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న గత ఏడాది ఖరీఫ్‌లో కొమ్మమూరు కెనాల్ కింద చినగంజాం మండలం వేటపాలెం, సంతరావూరు ప్రాంతాల్లో రైతులు వరి సాగుచేశారు. కాలువ చివరి ఆయకట్టు పొలాలకు నీరు సక్రమంగా అందకపోవడంతో కొందరు రైతులు ఎగువ ప్రాంతంలో ఇంజిన్లు పెట్టి కాలువలోకి నీటిని తోడిపోసి తమ పొలాలను నీటితో తడుపుకొన్నారు. ఆ తర్వాత వర్షం కురవడంతో కాలువలోకి నీరు చేరింది. ఆ నీటితో పాటు వర్షం నీటితో పంట తడవడంతో ఖరీఫ్‌లో చివరి ఆయకట్టులోనూ రైతులు పంట పండించుకున్నారు. ఇదంతా గత ఏడాది జరిగిన తంతు.

పట్టించుకోని రెవెన్యూ అధికారులు..

వారం రోజుల కింద చిన్నగంజారం తహసీల్దార్ ప్రభాకర్‌రావు వద్దకు వెళ్లి తమ ధాన్యం బయటకు తెచ్చుకోకుండా సదరు నేత అడ్డుకుంటున్నాడని ఫిర్యాదు చేసినా స్పందించలేదని రైతులు తెలిపారు.

గతేడాది మౌనం.. నేడు దౌర్జన్యం

కొమ్మమూరు కెనాల్ పరిధిలో అధికారుల అనుమతులు లేకుండా కాలువకు ఇంజన్లు పెట్టి నీటిని తోడిపోయడం నేరం. కానీ ఆ ప్రకారం గత ఏడాది నీటిని తోడిపోసుకుంది కూడా ఆ పచ్చనేత కోటయ్య, ఆయన అనుచరుల పొలాలకు మాత్రమేనన్నది రైతుల వాదన. అందరికీ నీటిని అందించకుండానే రైతుల అనుమతులు లేకుండా ఎకరాకు రూ. 4 వేలు కప్పం విధించడం ఏంటో ఎవరికీ అంతుబట్టడంలేదు. ఒకవేళ అదే ప్రకారం అనుకున్నా గత ఏడాది పంట వచ్చినప్పుడే రైతుల నుంచి డబ్బులు ఎందుకు వసూలు చేయలేదో ఎవరికీ అంతుబట్టడంలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అక్రమ వసూలు చేయలేని పరిస్థితి ఉంది కాబట్టే సదరు పచ్చనేతకు డబ్బు వసూలు ఆలోచన తట్టినట్టులేదు. కూటమి అధికారంలోకి రాగానే పచ్చనేత రైతులనుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు.

ధాన్యం తీసుకెళ్లడానికి వీల్లేదంటున్నారు



నేను చవిటివాదలో రెండెకరాలు మాగాణి భూమిలో వరి సాగు చేశారు. వరి కోతకు వచ్చింది. కోత కోయాల్సి ఉంది. పండిన ధాన్యం బస్తాలు బయటకు తీసుకెళ్లాలంటే ఎకరాకి రూ. 4 వేలు చెల్లించాలని కోటయ్య తన మనుషుల ద్వారా అడ్డుకుంటున్నాడు. డబ్బు చెల్లించకుండా ధాన్యం తరలిస్తే ఒప్పుకోమని బెదిరింపులకు దిగుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదు.

– లక్ష్మీనారాయణ, రైతు, వేటపాలెం

అధికారులు పట్టించుకోవడం లేదు



నాకు చవిటివాదలో ఏడెకరాల మాగాణి భూమి ఉంది. ఆ పొలాల్లో నేనే సొంతంగా వరి సాగు చేశాను. కోతకు వచ్చిన పంటను కోశాను. పడించిన ధాన్యం బస్తాలు రోడ్డు పైకి ట్రైరు బండ్ల ద్వారా చేర్చుకోవడానికి వీల్లేదని కోటయ్య అడ్డకుంటున్నాడు. ఏడెకరాల పొలం సాగు కోసం అప్పచేసి రూ.1.70 లక్షలు ఖర్చు చేశాను. నేను ఆయన నీళ్లు పొలానికి వాడలేదు. ఎకరాకి రూ.4 వేలు చెల్లించి పండించిన ధాన్యం రోడ్డు పైకి తరలించు కోవాలని దౌర్జన్యం చేస్తున్నాడు. రెవెన్యూ అధికారులు దృష్టికి సమస్య తీసుకెళ్లినా పరిష్కరించ లేదు.

– పి.బలరామిరెడ్డి, రైతు, వేటపాలెం

ఏం చేయాలో పాలుపోవడం లేదు



నేను చవిటివాదలో నాకున్న రెండు ఎకరాల మాగాణి పొలంలో వరి సాగు చేశాను. ఇప్పుడు పంటకోసి ధాన్యం తీసుకెళదామంటే కోటయ్య, ఆయన మనుషులు ఎకరాకు రూ. 4 వేలు చెల్లించి బస్తాలు తీసుకెళ్లాలని చెబుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం ఇంటికి తరలించుకోవడాన్ని అడ్డుకోవడంతో ఏం చేయాలో తెలియడం లేదు. అధికారులు జోక్యం చేసుకొని ధాన్యం ఇంటికి తరలించే విధంగా చర్యలు చేపట్టాలి.

– నాయుడు, రైతు, వేటపాలెం

ప్రయోగ పరీక్షలపై సీసీ కెమెరాల నిఘా

- నేటి నుంచి సీనియర్ ఇంటర్ విద్యార్థులకు ప్రారంభం
- గుంటూరు జిల్లాలో 119 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- బోర్డు సైట్‌తోపాటు వాట్సాప్ ద్వారా హాల్ టిక్కెట్లు పొందే వీలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ద్వితీయ సంవత్సర సైన్స్ కోర్సుల విద్యార్థులకు సోమవారం నుంచి ప్రారంభం కానున్న ప్రాక్టికల్స్ కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా 119 కళాశాలల్లోని ఈ ప్రాక్టికల్స్ జరగనున్నాయి. 26,308 మంది ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా ప్రాక్టికల్స్ జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా నాజ్ జంబ్లింగ్ విధానంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఇంటర్మీడియెట్ బోర్డు అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది. బోర్డు కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు ప్రాక్టికల్స్ సరళిని లైవ్ స్ట్రీమింగ్ ద్వారా తిలకించనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ చీఫ్ సూపరింటెండెంట్లుగా, ప్రైవేటు కళాశాలలకు ప్రభు త్వ కళాశాలల నుంచి అధ్యాపకులను సీఎస్‌లుగా నియమించారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు హాల్ టిక్కెట్లు నిరాకరిస్తే నేరుగా బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించినట్లు ఆర్‌ఐఓ జీకే జుబేర్ చెప్పారు. అదేవిధంగా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 95523 00009 నంబరుకు హాయ్ అనే మెసేజ్‌ను పంపి, విద్యాసేవలను ఎంపిక చేసుకున్న తరువాత ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ నంబరు, పుట్టినతేదీ వివరాలను నమోదు చేసుకుని పొందవచ్చని తెలిపారు.

తైక్వాండోలో మెరిసిన చీరాల క్రీడాకారులు



పతకాలు సాధించిన క్రీడాకారులు, శిక్షకులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

- ఏడు బంగారు, 12 రజిత, 13 కాంస్య పతకాలు కైవసం
- ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా

చీరాల రూరల్: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో చీరాల క్రీడాకారులు విశేష ప్రతిభ చూపించి పతకాలతో మెరిపించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రీడాకారులు ఏడు బంగారు పతకాలు, 12 రజిత, 13 మూడు కాంస్య పతకాలను కైవసం చేసుకుని ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కూడా దక్కించుకున్నారు. గత నెల 31వ తేదీ నుంచి ఈనెల 2 వరకు కాకినాడ జేఎన్‌టీయూలో ఆంధ్రప్రదేశ్ యూత్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ మెమోరియల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తైక్వాండో చాంపియన్‌షిప్ –2025 పోటీలు నిర్వహించారు. శిక్షకులు సయ్యద్ సలావుద్దీన్, సీహెచ్ వెంకటప్రసాద్, పి.ప్రశాంత్ బాబు, ప్రకాశం తైక్వాండో అసోసియేషన్ జిల్లా సెక్రటరీ షేక్ అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. తమ ప్రత్యర్థులను చిత్తుచేసి ఏడు బంగారు, 12 రజిత, 13 కాంస్య పతకాలను, ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కూడా కై వసం చేసుకున్నారు. పతకాలను కై వసం చేసుకున్న క్రీడాకారులు, శిక్షకులు స్థానిక ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యను ఆదివారం కలిశారు. ఆయన వారికి శాలువాలు, పూల బొకేలు అందించి ఘనంగా సత్కరించారు. పతకాలు సాధించిన క్రీడాకారులంతా చీరాల వాసులే కావడం విశేషమని ఎమ్మెల్యే తెలిపారు.

సద్గుణ రాశి.. సదా సన్నుతి

వైభవంగా గుణదల మేరీమాత ఉత్సవాలు ప్రారంభం



ఊరేగింపుగా మేరీమాత స్వరూపాన్ని తీసుకొస్తున్న గురువులు

గుణదల(విజయవాడ తూర్పు): క్రైస్తవ ఆధ్యాత్మిక శిఖరంగా వెలుగొందుతున్న గుణదలలో మేరీ మాత ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కొండ దిగువన ఉన్న బిషప్ గ్రాసీ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు తదితర గురువులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను లాంఛన ప్రాయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్ రాజారావు భక్తులకు దైవ సందేశాన్ని అందిస్తూ, పోప్ ఫ్రాన్సిస్ జగద్గురువులు 2025 సంవత్సరాన్ని జూబ్లీ సంవత్సరంగా ప్రకటించారన్నారు. మరియ మాతను ఆశ్రయించడం ద్వారా మన కష్టాలు తొలగిపోయి సుఖశాంతులు చేకూరుతాయని పేర్కొన్నారు.

దేవునికి అసాధ్యమేమి లేదు..

అనంతరం స్వర్ణ జుబిలేరియన్ ఫాదర్ పుతుకులంగర జోసఫ్ దైవ సందేశాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ దేవునికి అసాధ్యమైనది ఏదీ లేదన్నారు. ఆయనను విశ్వసించిన భక్తుల జీవితాలలో శాంతి సమాధానాలు నెలుకొంటాయని పేర్కొన్నారు. బైబిల్ గ్రంథ ప్రకారం కానాను పెళ్లి విందులో ద్రాక్షారసం అయిపోయినప్పుడు యేసుక్రీస్తు చేసిన అద్భుతాన్ని గుర్తు చేశారు. లోక రక్షకుడైన క్రీస్తును ఈ లోకానికి అందించిన మరియతల్లి సర్వజనుల మాతగా నిలిచిందన్నారు. దేవుడు మనకు తెలియపరిచిన నియమాలను ఆచరించి ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడుచుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పూజా పీఠంపై విజయవాడ బిషప్ రాజారావు, వికార్ జనరల్ ఫాదర్ ఎం. గాబ్రియేలు, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఎడ్యుకేషన్ డెస్క్ డైరెక్టర్ ఫాదర్ కొలకాని మరియన్న, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ సునీల్‌రాజు కలసి ప్రారంభ సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు.

భక్తులతో పోటెత్తిన కొండ..

ఉత్సవాల తొలిరోజైన ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు లక్షలాదిగా పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. మరియతల్లిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. దీంతో గుణదల కొండ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

రైతులపై భూ సేకరణ పిడుగు!

అమరావతి రైల్వే ప్రాజెక్టు భూసేకరణలో రాష్ట్ర ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని రాజధాని గ్రామాల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు నిర్మించనున్న రైల్వే లైన్‌కు భూమి ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. భూ సేకరణ కాకుండా సమీకరణ చేయాలని చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. బలవంతంగా భూసేకరణకు సిద్ధమైతే కోర్టును ఆశ్రయించక తప్పదని స్పష్టం చేస్తున్నారు.



డిసెంబర్‌లో భూసేకరణను వ్యతిరేకిస్తూ తాడికొండ గ్రామ సభలో తీర్మానం చేస్తున్న దృశ్యం (ఫైల్)

- అమరావతి రైల్వే లైన్ భూసేకరణపై రైతులు ఆగ్రహం
- భూ సమీకరణ మాత్రమే చేయాలని డిమాండ్
- రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువలు పెంపు
- అమరావతి పరిసర ప్రాంతాల్లో మాత్రం ప్రభుత్వం మొండిచేయి
- రైల్వే ఇచ్చే పరిహారం చాలా తక్కువ వస్తుందని ఆందోళన
- రైతుల అభ్యంతరాలు స్వీకరించకుండానే పెగ్ మార్కింగ్‌కు సిద్ధం


సాక్షి ప్రతినిధి, గుంటూరు: అమరావతి రైల్వే లైన్ కోసం గుంటూరు జిల్లాలో 1,753 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. అమరావతి మండలం కర్లపూడి గ్రామంలోనే 232 ఎకరాలు సేకరించనున్నారు. ఇదే గ్రామంలో ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం 153 ఎకరాలు, ఈ7, ఈ8, ఈ9 రోడ్లు, ఔటర్ రింగ్ రోడ్డు కోసం 900 ఎకరాలు కోల్పోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు రైల్వే లైన్‌కు భూమి ఇవ్వాలని అడుగుతున్నారని, దీనికి కేంద్రం ఇచ్చే ప్యాకేజీ సరిపోదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విమానాశ్రయం కోసం ఎక్కడో ఉన్న గన్నవరంలో భూములిచ్చిన వారికి రాజధానిలో 1,450 గజాలు ల్యాండ్‌పూలింగ్ ప్యాకేజీ కింద ఇచ్చారని, తమకు మాత్రం ఇవ్వకపోవడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు.

ఇంత అన్యాయమా?

ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా భూముల ప్రభుత్వ విలువ పెంచిన రాష్ట్ర ప్రభుత్వం అమరావతి రాజధాని, పరిసర ప్రాంతాల్లో మాత్రం పెంచలేదు. ఇదేం అన్యాయమని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల రైల్వే లైన్ భూ సేకరణలో తాము తీవ్రంగా నష్టపోతామని చెబుతున్నారు. తమ గ్రామంలో భూమి ప్రభుత్వ విలువ ఎకరం రూ. 16 లక్షలు ఉంటే.. దానిపై కేవలం రూ. 4 లక్షలు మాత్రమే పెంచారని, మిగిలిన చోట్ల అసలు పెంచలేదని కర్లపూడి రైతులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో తమ భూముల ఎకరా దాదాపు రూ. 4 కోట్లు ఉండగా, ఇప్పుడు రైల్వే నుంచి రూ. 50 లక్షలు కూడా రావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క రైల్వే ప్యాకేజీకి అదనంగా ల్యాండ్ పూలింగ్‌లో ఇచ్చే ప్యాకేజీలో 33 శాతం అంటే 410 గజాల స్థలం ఇప్పిస్తామని మంత్రి నారాయణ ఇటీవల రైతులకు సర్దిచెప్పారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ 650 గజాల వరకు ఇప్పించడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. అయితే దీనికి కూడా రైతులు అంగీకరించడం లేదు. పూర్తిగా పూలింగ్ ప్యాకేజీ ఇవ్వాలని కోరుతున్నారు. రాజధాని రైతులకు ఇచ్చినట్లుగా ఫారం.9.14 ఇవ్వాలని, అందులో ఎంత భూమి ఇస్తారు, ఇళ్ల స్థలం ఎంత, వాణిజ్య స్థలం ఎంత, కౌలు ఎన్ని సంవత్సరాలు ఇస్తారన్న విషయాలను స్పష్టం చేయకుండా భూములు ఇచ్చేది లేదని వారు చెబుతున్నారు. అసలు రైల్వే లైన్ అలైన్‌మెంటే తప్పు అని రైతులు అంటున్నారు. ల్యాండ్ పూలింగ్ చేసిన గ్రామాల నుంచి కాకుండా బయట నుంచి రైల్వే లైన్ వెళ్లడం వల్ల 4 కిలోమీటర్ల దూరం పెరుగుతుందని వాదిస్తున్నారు. గతంలో ఇచ్చిన మాస్టర్ ప్లాన్‌ను కదపకుండా బయట నుంచి అలైన్‌మెంట్ ఇచ్చామని మంత్రి నారాయణ చెబుతున్నారు.

పెగ్ మార్కింగ్ ఎలా చేస్తారు?

ప్రభుత్వం రైతులతో సమావేశాలు పెట్టినా, వారి అభ్యంతరాలు స్వీకరించకుండానే రైల్వే లైన్ భూసేకరణకు పెగ్ మార్కింగ్‌కు సిద్ధపడుతోంది. ఇలా ఇష్టానుసారం పెగ్ మార్కింగ్‌కు షెడ్యూల్ ప్రకటించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం అమరావతి తహసీల్దార్‌తో జరిగిన సమావేశంలో కర్లపూడి రైతులు ఇదే విషయాన్ని చెప్పారు. పోలీసు బందోబస్తుతో పెగ్‌మార్కింగ్‌కు రావడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారని, ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రాజధాని పరిసర ప్రాంతాల్లోని కంతేరు, కొప్పురావూరు, తాడికొండ, మోతడక గ్రామాల రైతులు రైల్వే లైన్ భూసేకరణను వ్యతిరేకిస్తూ గ్రామసభల్లో తీర్మానాలు కూడా చేశారు. రైల్వేలైన్ వల్ల పక్కన ఉన్న భూముల ధరలు కూడా పడిపోతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల పక్కనే 500 మీటర్ల వరకూ భూమిని సేకరించి, రైల్వే లైన్‌కు రెండువైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



క్లుప్తంగా

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పలువురికి పతకాలు



బాపట్ల: జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో బాపట్ల క్రీడాకారులకు పలు పతకాలు దక్కాయి. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3వరకు కేరళలోని త్రిసూర్‌లో జరిగిన పోటీల్లో పలువురికి పతకాలు లభించాయి.70 సంవత్సరాల విభాగంలో త్రిపుల్‌జంప్‌లో జగదీష్‌కు బ్రాంజ్ మెడల్, 65 సంవత్సరాల విభాగంలో పోల్‌వాల్ట్‌లో కె.శంకరరావుకు బ్రాంజ్ మెడల్, 60 సంవత్సరాల విభాగంలో 100మీటర్లు హార్డిల్స్‌లో బ్రాంజ్ మెడల్, 50 సంవత్సరాల విభాగంలో మురళీ కృష్ణారెడ్డి, ఎం.సురేంద్ర, టి.శ్రీనివాసరెడ్డి, అంజమ్మలు బ్రాంజ్‌మెడల్‌ను సొంతం చేసుకున్నారు. ఈమేరకు వీరిని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల అధ్యాపకులు సన్మానించారు.

మారథాన్ పోటీల్లో అబ్దుల్లా ప్రతిభ



వినుకొండ(నూజెండ్ల): రాజస్థాన్‌లో జరిగిన అల్వార్ టైగర్ టెన్ కిలోమీటర్స్ మారథాన్ పోటీలో పట్టణానికి చెందిన పరుగుల వీరుడు షేక్ అబ్దుల్లా ఏడో స్థానం సాధించారు. హిమాలయ ప్రాంతంలోని లడ్డాఖ్‌లో ఫిబ్రవరి 25న మంచు మీద జరిగే గిన్నిస్ బుక్ పరుగుల పోటీల్లో పాల్గొనే యత్నంలో భాగంగా పలు రాష్ట్రాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు. ఆర్థికంగా, మానసికంగా ధైర్యాన్ని అందించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, గుంటూరు ఈస్ట్ డీఎస్పీ జనాబ్ అజీజ్ భాయ్, డాక్టర్ సాయికృష్ణ, ఎండీ కరీముల్లా, విశ్రాంత ఉద్యోగి షేక్ అప్సర్ భాయ్ అభినందించారు.

పోటీ పరీక్షల్లో విద్యార్థి అల్తాఫ్ సత్తా



అల్తాఫ్

చిలకలూరిపేట: పసుమర్రు ఎంకే జెడ్పీ హైస్కూలు పదో తరగతి విద్యార్థి పఠాన్ మొహమ్మద్ అల్తాఫ్ ఈఈఎంటీ–2025(ఎడ్యుకేషనల్ ఎపిఫని మెరిట్ టెస్ట్)లో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వి.ఎస్. మస్తానయ్య నగదు బహుమతి, జ్ఞాపికను అందించారు. స్కూల్ హెచ్‌ఎం వై.హనుమంతరావు ఆదివారం మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో సాధించిన విద్యార్థి 100 మార్కులకు 70 సాధిస్తే, మొహమ్మద్ అల్తాఫ్ 66 మార్కులు సాధించినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని తెలిపారు. స్కూల్ కమిటీ చైర్మన్ కోట సుదర్శన్, వైస్ చైర్మన్ గౌసియా, 15,16 వార్డు కౌన్సిలర్లు జాలాది సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు షేక్ మొహమ్మద్ యాసిన్ మొహమ్మద్ అల్తాఫ్‌ను అభినందించారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఘోర విఫలం

- 24న జరిగే ధర్నాను విజయవంతం చేయాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న జేబీ శ్రీధర్

బాపట్లటౌన్: వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతుందని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గుంటూరు జిల్లా, తాడేపల్లి బైపాస్‌ఫీడర్ రోడ్డులోని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయం ముందు జిల్లాలోని వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 24న ధర్నా నిర్వహించనున్నామన్నారు. ఉపాధి హామీలో 200 రోజులు పనిదినాలు కల్పించి, రోజు వేతనం రూ.700 ఇవ్వాలని, మెటీరియల్ కాంపోనెంటు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిమాండ్ చేశారు. వలసలు ఆపాలని, ఉన్న గ్రామాల్లోనే పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో సరైన ఉపాధి లేక వ్యవసాయ కూలీలు వలసబాట పట్టారన్నారు. ఉపాధి కూలీల చేత చేయించాల్సిన పనులను కాంట్రాక్టరుయంత్రాలతో చేయిస్తూ పేదల కడుపులు కొడుతున్నారు. ఉపాధి హామీ పనులకోసం అధికారుల చుట్టూ తిరిగినా పనులు కల్పించడం లేదన్నారు. చేసిన పనికి నెలలు తరబడి బిల్లులు చెల్లించడం లేదన్నారు. ఉపాధి కూలీలకు పనులు కల్పించకపోతే ఉపాధి భృతిగా సంవత్సరంలో ప్రతి కూలీకి రూ.12 వేలు ఇవ్వాలన్నారు. పని ప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని, మజ్జిగ ప్యాకెట్లు తప్పనిసరిగా అందజేయాలన్నారు. పని ప్రదేశంలో ప్రమాదాల్లో మరణిస్తే 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. మండల స్థాయిలో వ్యవసాయ కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మామిడి బత్తుల వెంకటేశ్వరరావు, ఖమ్మంపాటి యలమంద, సీపీఐ బాపట్ల పట్టణ కార్యదర్శి మామిడిబత్తుల అశోక్ పాల్గొన్నారు.

చేతిరాత పోటీల్లో తృతీయ బహుమతి



బహుమతి అందుకుంటున్న మార్టూరు విద్యార్థిని ప్రైజీ వందన

మార్టూరు: గుంటూరు హిందూ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి చేతిరాత పోటీల్లో మార్టూరుకు చెందిన ఓ విద్యార్థిని తృతీయ బహుమతి కైవసం చేసుకుంది. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామ్మోహన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ విభాగాల్లో దాదాపు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో భాగంగా బాపట్ల జిల్లా నుంచి నలుగు విద్యార్థులు పాల్గొనగా లెవెల్–4 సీనియర్ విద్యార్థుల విభాగంలో మార్టూరు మద్ది సత్యనారాయణ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని జంధ్రాజు పల్లి ప్రైజీ వందన మూడో స్థానం కైవసం చేసుకుంది. రాష్ట్ర స్థాయి అవార్డుతో పాటు రూ.వెయ్యి నగదు బహుమతిని అందుకున్న బాలికను, శిక్షణనిచ్చిన ఉపాధ్యాయురాలు మాలంపాటి శారదను పాఠశాల హెచ్‌ఎం రూత్ మెర్సీ జాయ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరాలతో గ్రామీణులకు మేలు

మాజీ మంత్రి అంబటి రాంబాబు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి అంబటి, పక్కన డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: ఉచిత వైద్య శిబిరాలతో గ్రామీణులకు ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సత్తెనపల్లి మండలం పెదమక్కెనలో గజ్జల నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు జరుగుతున్న సమయంలో ప్రజలు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని, దీనివల్ల శరీరంలో రుగ్మతలు నిర్ధారణ అవుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి సీనియర్ వైద్యులని, ఆయన ఎన్నో ఆపరేషన్లు చేశారన్నారు. వారి ఆస్పత్రిలో అన్ని జబ్బులకు వైద్యం చేసే డాక్టర్లు ఉన్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు నిత్యం పొలం పనుల్లో నిమగ్నమవుతుంటారన్నారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వల్ల రుగ్మతలు ఉంటే తెలుస్తాయని, వాటిని ఎలా అధిగమించాలో డాక్టర్ తెలియజేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా వైద్యుల బృందం గ్రామస్తులు వివిధ పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఉచిత వైద్య విబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల శివారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు సలహా మండలి మాజీ సభ్యుడు కళ్లం విజయభాస్కర్ రెడ్డి, పార్టీ సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, గ్రామ మాజీ సర్పంచ్ ఒద్దుల శ్రీనివాస రెడ్డి, నాయకులు ఒద్దుల రామకృష్ణారెడ్డి, రవీంద్రా రెడ్డి, వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

కారు ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు

నరసరావుపేట టౌన్ : అతివేగంగా వచ్చిన కారు డ్రైవర్ బాలుడిని ఢీకొన్న సంఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామిరెడ్డిపేట పాత పోస్టాఫీస్ సమీపంలో ఇంటి బయట కూర్చొని ఉన్న ఆరేళ్ల బాలుడు రియాన్‌పై అతివేగంగా వచ్చిన కారు ఎక్కింది. ఈ సంఘటనలో అతడి కాళ్లు రెండూ విరిగాయి. కుటుంబ సభ్యులు సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయ్‌చరణ్ తెలిపారు.

సికింద్రాబాద్‌లో బైట మంజులూరు వాసి మృతి

జె.పంగులూరు: తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని బైట మంజులూరు గ్రామానికి చెందిన వ్యక్తి మరణించిన సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. మృతుని బంధువులు తెలిపిన సమాచారం మేరకు.. బైట మంజులూరు గ్రామానికి చెందిన సరికొండ రవిరాజు (50) గత కొన్ని సంవత్సరాలుగా హైదరాబాదులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 15వ తేదీ రవిరాజు అన్న కుమారుని వివాహం జరగాల్సి ఉండగా.. సికింద్రాబాద్‌లో ఉన్న తన బంధువులకు పెళ్లి కార్డు ఇచ్చేందుకు రవిరాజు, బాబాయి కొడుకుతో కలిసి మోటార్ సైకిల్‌పై సికింద్రాబాద్ బంధువుల ఇంటికి బయలు దేరారు. ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీ కొట్టడంతో రవిరాజుకు తీవ్ర గాయలయ్యాయి. వెనుక కూర్చొని ఉన్న అతని బాబాయి కొడుక్కి స్వల్ప గాయాలయ్యాయి. రవి రాజును ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మరణించినట్లు బంధువులు తెలిపారు. రవిరాజుకు భార్య రమాదేవి, ఇద్దరు ఆడపిల్లలున్నారు.

లారీ డ్రైవర్‌పై చెక్‌పోస్ట్ సిబ్బంది దాడి

నరసరావుపేట రూరల్: లారీ డ్రైవర్‌పై వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్ట్ సిబ్బంది దాడి చేయడంతో ఆదివారం ఉదయం ఎస్ఆర్‌కేటీ కాలనీ జంక్షన్‌లో ఉద్రిక్తత ఏర్పడింది. చెక్‌పోస్ట్ సిబ్బంది చర్యను నిరసిస్తూ లారీ ఓనర్స్, డ్రైవర్లు ఆందోళనకు దిగారు. ధాన్యం లోడుతో ఉన్న లారీ ఆయిల్ కోసం ఎస్ఆర్‌కేటీ పెట్రోల్ బంక్‌లోకి వెళ్తుండగా చెక్‌పోస్ట్ సిబ్బంది ఆపేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో కర్రతో లారీపై కొట్టారు. డ్రైవర్ లారీని నిలిపి ఎందుకు కర్రతో కొడుతున్నారని ప్రశ్నించాడు. దీనిపై మాటామాట పెరిగి లారీ డ్రైవర్‌పై మార్కెట్ కమిటీ దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న లారీ ఓనర్స్‌తో పాటు డ్రైవర్లు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. చెక్‌పోస్ట్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై లారీని నిలిపి ఆందోళనకు దిగారు. హైవేపై వెళ్తున్న లారీల వద్ద డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. ఇవ్వని డ్రైవర్లను వేదిస్తున్నారని తెలిపారు. చెక్‌పోస్ట్ సిబ్బందితో పాటు హైవే పెట్రోలింగ్ పోలీసులు, మైనింగ్ శాఖకు చెందిన ఏఎంఆర్ సంస్థ సిబ్బంది కూడా ఈ దందాలో పాల్గొంటున్నారని విమర్శించారు. మార్కెట్ కమిటీ సిబ్బంది లారీ డ్రైవర్‌కు క్షమాపణలు చెప్పడంతో ఆందోళన విరమించారు.

పెట్టుబడి పేరుతో రూ.48 లక్షలు టోకరా

కేసు నమోదు చేసిన అరండల్ పేట పోలీసులు

లక్ష్మీపురం: ఆన్‌లైన్ ద్వారా ప్రైవేట్ సంస్థకు పెట్టుబడి పెట్టి రూ.48 లక్షలు మోసపోయిన ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు శనివారం అర్ధరాత్రి కేసు నమోదు చేసిన ఘటన చోటుచేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత్‌పేట 3/1వ లైన్ ప్రాంతానికి చెందిన గరికపాటి నవీన్ అనే వ్యక్తి ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ 5వ తేదీన ఆన్‌లైన్ ద్వారా అలియన్స్ ఇన్వెస్ట్‌మెంట్ అనే సంస్థలో పెట్టుబడులు పెట్టడం ద్వారా లాభాలను ఆర్జించవచ్చని మొదట రూ.50 వేలు పెట్టుబడి పెట్టాడు. దానికి తిరిగి ఆ సంస్థ నవీన్‌కు నమ్మకం కలిగేలా కొంత లాభాన్ని కలిపి ఖాతాలోకి జమ చేసింది. అక్కడి నుంచి నవీన్ విడతలవారీగా రూ.48 లక్షల వరకు పెట్టుబడి పెట్టి మోసపోయారు. అరండల్‌పేట పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేతుల్లోనూ, రేఖల్లోనూ అదృష్టాలు ఉండవు



నగరంపాలెం: తాను చెప్పే మాటల్లో నచ్చనవి వదిలేయాలని, నచ్చిన మాటలను ఆచరించాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత, మహా సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. పట్టాభిపురం శ్రీరమా సత్యనారాయణ స్వామి వారి (48) బ్రహ్మోత్సవాలు ఆదివారం రెండో రోజుకి చేరాయి. భారత యుద్ధంలో భగవంతుని పాత్రపై గరికపాటి ప్రసంగిస్తూ ఆచరణను గురువుకి దక్షిణగా ఇవ్వాలని అన్నారు. ప్రతి ఒక్కరిలో తెర వెనుక, ప్రత్యక్షంగా దేవుని పాత్ర ఉంటుందని చెప్పారు. అన్నివేళల్లో మనమందరం అదృష్టవంతులమని అన్నారు. ఎప్పటికప్పుడు అదృష్టవంతులమని, దురదృష్టమని ఎందుకు భావించాలని పేర్కొన్నారు. అదృష్టాలు, దురదృష్టాలు మన చేతుల్లోనూ, రేఖల్లోనూ ఉండవని మన బుద్ధిలో ఉంటాయనేది ప్రతి ఒక్కరూ నమ్మాలని చెప్పారు. మన చేతుల్లోనూ, మనం తీసుకునే నిర్ణయంలో, ఆలోచనలో అదృష్టం ఉంటుందని వివేకానందుడు అంటాడని గుర్తుచేశారు. ఇవన్నీ కూడా అదృష్టమేనని అన్నారు. భారతం రోజుకి గంట చొప్పున ప్రతి ఒక్కరూ చదవాలని చెప్పారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



అజయ్(ఫైల్)

రెంటచింతల: స్థానిక చికెన్ దుకాణాల సెంటర్‌లో యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ సీహెచ్. నాగార్జున తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని ఆనందపేటకు చెందిన అనుముల అజయ్(26) సోదరుడైన నవీన్‌తో కలిసి మాచర్ల– గుంటూరు ప్రధాన రహదారి వెంబడి ఉన్న ఓ కిరాణా దుకాణంలో ఐదేళ్ల నుంచి పని చేస్తున్నారు. దుకాణం పైనున్న ఓ గదిలో అజయ్ కొంతకాలంగా అద్దెకు ఉంటున్నాడు. శనివారం రాత్రి మద్యం తాగిన అతడు ఆదివారం తెల్లవారుజామున మత్తులో కిందకు దిగే సమయంలో ఇంటి పైనుంచి కిందపడి తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గురజాల డీఎస్పీ బి.ఎల్.ఎన్. జగదీష్, కారంపూడి సీఐ శ్రీనివాసరావు సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారని ఎస్ఐ తెలిపారు. మృతుడి తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పంచనామా నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించినట్లు చెప్పారు. డాగ్ స్క్వాడ్‌ను పిలిపించామని తెలిపారు.

గ్రామస్తుల్లో పలు అనుమానాలు

అజయ్ మృతిపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శరీరంపై గాయాల గురించి చర్చించుకుంటున్నారు. శనివారం రాత్రి అజయ్ గదిలో ఎంతమంది మద్యం తాగారు...వారు ఏమైనా ఘర్షణ పడ్డారా? అనే విషయాలపై పోలీసులు విచారిస్తున్నారు. అజయ్ చివరి ఫోన్‌కాల్ ఎవరికైనా చేశాడా ? అనే కోణంలో పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం.

వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా చక్రవర్తి

కొరిటెపాడు(గుంటూరు): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా కె.పి.చక్రవర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యవసాయ ఉద్యోగుల కార్యవర్గ సమావేశం ఆదివారం గుంటూరులోని కృషి భవన్‌లో నిర్వహించారు. సమావేశంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యవసాయ ఉద్యోగుల కార్యవర్గ సమావేశాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా కె.పి.చక్రవర్తి, ప్రధాన కార్యదర్శిగా వైవీఎస్ ప్రసాద్, కోశాధికారిగా ఎస్.ఆనంద్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పి.రాంబాబు, కుంచాల శ్రీనివాసరావు, విక్టర్ కుమార్, ఐజాక్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్.శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా కాకాని శ్రీనివాసరావు, వై.చెన్నకేశవరావు, కె.రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా రామలింగేశ్వరరావు, మహిళా విభాగపు కార్యదర్శులుగా ఎస్.అంజలి, కళ్యాణిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి హెచ్ రూపేశ్‌కుమార్ నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు టీవీ రామిరెడ్డి, అధ్యక్షుడు వి.రఘురామనాయుడు, ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తాం

మెరైన్ ఎస్ఐ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరావు

బాపట్ల: మత్స్యకారులకు సముద్రంలో 12 నాటికల్ మైళ్లలోపు ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కారించేందుకు మెరైన్ సిబ్బంది సిద్ధంగా ఉంటారని మెరైన్ ఎస్ఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మత్స్యకార సంక్షేమ సమితి 20వ రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈసమావేశంలో ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్స్యకారులకు సముద్రంలో ఏదైనా సమస్య ఎదురైనప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 1093కు ఫోన్ చేయాలని తెలిపారు. సాగరంలోని జలాలు కలుషితం కాకుండా మత్స్యకార సమాజంతోపాటు ఎన్జీఓలు కూడా పూర్తిగా సహకరించాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత సంఘ మానవీయ రవి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరు సహకరించాలని సూచించారు. అనంతరం మత్స్యకార సంక్షేమ సమితి నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మురళి ధరమ్‌జీ, రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మడి మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరిమళ్ళ వాసు, రాష్ట్ర సెక్రటరీ సన్నపు తిరుపతిరావు, గౌరవాధ్యక్షుడు మైలా శ్రీనివాస్, అర్జునకుమార్, కొలం గారి పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో కార్పొరేట్ వైద్యసేవలు

శ్రీ గోరంట్ల సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల అర్బన్: అత్యవసర వైద్యసేవలకు గుంటూరు, విజయవాడ వెళ్లనవసరం లేకుండా చీరాలలోనే కార్పొరేట్ వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో వంద పడకల హాస్పిటల్‌ను ఏర్పాటు చేయడం శుభపరిణామమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎల్‌బీఎస్ నగర్‌లో ఏర్పాటు చేసిన శ్రీ గోరంట్ల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా చీరాలలో వంద పడకల హాస్పిటల్ ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. జిల్లాలో చీరాల ప్రాంతం వైద్యపరంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. చీరాల పరిసర ప్రాంతాల్లో అందరికి అందుబాటులో కార్పొరేట్ వైద్యసేవలందించే హాస్పిటల్ ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ చీరాల ప్రాంతంలో అత్యాధునిక వైద్య సేవల వల్ల పేద, బడుగు, బలహీనవర్గాలకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. హాస్పిటల్ ఎండీ గోరంట్ల రాజేష్ మాట్లాడుతూ గుండె, మెదడు, నరాల స్పెషలిస్టులు 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. క్యాథ్ ల్యాబ్ సౌకర్యం ఉందన్నారు. అన్ని రకాల వసతులు, వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. త్వరలోనే ఎన్టీఆర్ వైద్యసేవలను అందిస్తామన్నారు. గుంటూరు, విజయవాడ వెళ్లనవసరం లేకుండా చీరాలలోనే పూర్తిస్థాయి వైద్యసేవలందిస్తామన్నారు. అనంతరం ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, జనరల్ వార్డులను ప్రారంభించారు. డాక్టర్లు గోరంట్ల శ్రావణి, గోరంట్ల కృష్ణచైతన్య, డాక్టర్ ప్రీతి, గోరంట్ల నవీన్, డాక్టర్ ప్రసన్న, చీరాలలోని ఐఎంఏ డాక్టర్ల బృంద సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగికదాడి యత్నం

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- నిందితుడు అరెస్టు

కొల్లూరు: ముక్కుపచ్చలారని చిన్నారిపై ఓ మానవ మృగం లైంగికదాడి యత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన 7 ఏళ్ల మైనర్ బాలిక స్థానికంగా విద్యాభ్యాసం చేస్తుంది. జనవరి 29న బాలిక తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లిన సమయంలో ఇంటి ముందు ఆడుకుంటుంది. ఆమె సమీపంలో గృహంలో నివసించే 49 ఏళ్ల ఉదరగడి లక్ష్మయ్య ఒంటరిగా ఉన్న బాలికను గమనించాడు. బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకొని వెళ్లి తలుపులు వేశాడు. అనంతరం అతని దుస్తులను తొలగించి బాలిక దుస్తులు తొలగించేందుకు ప్రయత్నిస్తుండగా భయపడిన చిన్నారి అతని బారినుంచి తప్పించుకొని అక్కడ నుంచి పారిపోయి ఇంటికి చేరుకొంది. జరిగిన సంఘటనతో భయపడిన బాలిక తల్లిదండ్రులకు విషయం చెప్పకుండా తనలో తాను మధనపడుతోంది. అయితే ఈనెల 5న ఇంటిముందు బాలిక ఉన్న సమయంలో లైంగిక దాడి యత్నానికి పాల్పడిన లక్ష్మయ్య ఆమె ఇంటి ముందు నుంచి వెళుతుండటంతో భయపడి పరిగెత్తుకుంటూ తన మేనత్త వద్దకు చేరుకుంది. బాలిక భయపడుతూ పరిగెత్తుకొని రావడం గమనించిన ఆమె మేనత్త ఏం జరిగిందని అడగడంతో లక్ష్మయ్య తనతో ప్రవర్తించిన తీరు గురించి వివరించింది. దీంతో ఆమె తల్లిదండ్రులు కూలి పనుల నుంచి తిరిగి వచ్చిన అనంతరం విషయం వారి దృష్టికి బాలిక మేనత్త తీసుకువెళ్లింది. బాలికతో లక్ష్మయ్య వ్యవహరించిన తీరుతో రగిలిపోయిన తల్లిదండ్రులు, బంధువులు నిందితుడి గృహం వద్దకు వెళ్లి నిలదీయడంతోపాటు దేహశుద్ధి చేశారు. అనంతరం స్థానిక పెద్దమనుషుల వద్ద జరిగిన అఘాయిత్యం గురించి వెల్లడించిన బాలిక తల్లిదండ్రులు శనివారం కొల్లూరు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, వేమూరు సీఐ పీవీ ఆంజనేయులు సంఘటనపై విచారణ నిర్వహించారు. నిందితుడు లక్ష్మయ్యను ఆదివారం మండలంలోని మొసలిపాడు వద్ద అదుపులోకి తీసుకొని తెనాలి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ జి.ఏడుకొండలు తెలిపారు.

రేపల్లెలో వృద్ధురాలి హత్య



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: పట్టణంలో వృద్ధురాలు హత్యకు గురైన ఘటన సంచలనం రేకెత్తించింది. పట్టణంలోని 3వ వార్డు మున్సోబువారిపాలెంకు చెందిన పసుపులేటి వెంకటేశ్వరరావు భార్య పసుపులేటి సరస్వతి (68)ని శనివారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గొంతు కోసి హత్యకు పాల్పడ్డారు. తెల్లవారినా సరస్వతి నిద్రలేవకపోవటంతో స్థానికులు తలుపుతట్టి చూడగా ఆమె రక్తపు మడుగులో విగత జీవిగా పడి ఉంది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, పట్టణ సీఐ మల్లికార్జునరావు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి కుమార్తె ఉషారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఆస్తి తగాదాల నేపథ్యంలో హత్య జరిగి ఉండవచ్చని కుమార్తె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్ పరిశీలించి వివరాలను సేకరించింది. మృతురాలి భర్త వెంకటేశ్వరరావు నాలుగు నెలల క్రితమే మృతి చెందటంతో అప్పటి నుంచి సరస్వతి ఒంటరిగా జీవిస్తోంది.

ఎడ్ల పందేల నిర్వహణ అభినందనీయం

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



పందేలను ప్రారంభిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



మాచవరం: పశుపోషకులను ప్రోత్సహిస్తూ ఎడ్ల పందేలు నిర్వహించడం అభినందనీయమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండలంలోని మోర్జంపాడులో శ్రీలక్ష్మీనరసింహస్వామి 69వ కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ ఒంగోలు జాతి ఎడ్ల బల పదర్శన పోటీల్లో భాగంగా ఆదివారం ఆయన ఆరుపళ్ల విభాగాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరిని సుఖ, సౌభాగ్యాలతో క్షేమంగా కాపాడాలని దేవుని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉన్నం నాగమల్లేశ్వరావు, రైతు సేవా సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నాలుగు పళ్ల విభాగంలో విజేతలు

చిలుకూరి నాగేశ్వరావు (జె.పంగులూరు, బాపట్ల జిల్లా) ఎడ్లు 4926.2 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ బహుమతిని అందుకున్నాయి. నెల్లూరి రామకోటయ్య (కేసానుపల్లి, దాచేపల్లి మండలం, పల్నాడు జిల్లా) ఎడ్లు 4812.9 అడుగులు, అనంతనేని శ్రీకావ్య మధు (యనమలకుదురు,పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా) ఎడ్లు 4661.6 అడుగులు, గాదె కిశోర్‌రెడ్డి (మఠంపల్లి, తెలంగాణ) ఎడ్లు 4400 అడుగులు, కత్తి రాజు (వంగపాడు, బెస్తవారిపేట, ప్రకాశం జిల్లా) ఎడ్లు 4190 అడుగులు, కోటా కోటేశ్వరరావు (కేసానుపల్లి, దాచేపల్లి మండలం, పల్నాడు జిల్లా) ఎడ్లు, తుమ్మా థామస్ రెడ్డి (మండాది, వెల్దుర్తి మండలం, పల్నాడు జిల్లా) కంబైన్డ్ జత 4133.9 అడుగులు, దర్శి సాత్విక్ యాదవ్(తుర్లపాడు, చంద్రర్లపాడు మండలం, ఎన్‌టీఆర్ జిల్లా) ఎడ్లు 3806.6 అడుగుల దూరాన్ని లాగి బహుమతులు అందుకున్నాయి.